క్లుప్తంగా

జోన్-2 వర్క్స్ డీఈగా మణికుమార్



జెడ్సీ కనక మహాలక్ష్మికి మొక్క బహూకరిస్తున్న మణికుమార్

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 ఇంజినీరింగ్ శాఖ వర్క్స్ డీఈగా తాలూరి మణికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఈయన జోన్‌లోని భీమిలి నియోజకవర్గానికి చెందిన 5, 6, 7, 8 వార్డుల బాధ్యతలు చూస్తారు. ఈ వార్డులు గతంలో చూసిన వెంకటరావు ఇదే జోన్‌లోని విశాఖ తూర్పు నియోజక వర్గానికి చెందిన 9 నుంచి 13 వరకు గల వార్డులు చూస్తారు.

నిధుల మంజూరుకు జెడ్సీకి వినతి



జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు జోన్ -1 జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు వినతి పత్రం అందజేశారు. కాపులదిబ్బడపాలెంలో కల్యాణ మండపం, తిమ్మాపురం స్కూల్ వద్ద డ్రైనేజీ కవర్ శ్లాబ్‌లు, బీచ్ రోడ్డులో మూడు చోట్ల బస్టాప్‌ల ఏర్పాటు, వార్డులో ఉన్న ఆరు సచివాలయాల పరిధిలో శ్మశానవాటికలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. 4 వార్డులో తాగునీరు సమస్య వేధిస్తోందని, జీవీఎంసీ నుంచి తాగు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం: మండలంలోని తునివలసలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ కె.ఆనంద రావు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సత్యం నాయుడు, మాజీ ఎంపీపీ కె.లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరావు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణి పేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ కూడా అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని,వివరాలకు 9676170026, 7989572891లోసంప్రదించాలని సూచించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలను అందజేశారు.

పార్కుల పరిరక్షణకు కదిలిన యంత్రాంగం

జోన్-2లోని 23 పార్కుల్లో అనధికార నిర్మాణాల గుర్తింపు

ఒకేరోజు 7 పార్కుల్లో ఆక్రమణల తొలగింపు



టీచర్స్ లే అవుట్‌లోని పార్క్‌లో అనధికార నిర్మాణం తొలగింపు పనులు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి (ఫైల్)

మధురవాడ: పార్కుల పరిరక్షణకు జీవీఎంసీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు జోన్‌లోని అన్ని విభాగాల కార్యదర్శులు ఏసీపీ, టీపీవో తదితర అధికారుల నేతృత్వంలో బృందాలు ఏర్పాటు చేసి జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ నెల 26న ఆక్రమణలను తొలగించారు.

జోన్ పరిధిలోని జీవీఎంసీ 5 నుంచి 13 వరకు ఉన్న 9 వార్డుల్లో మొత్తం 304 పార్కులు ఉండగా, వాటిలో 34 పార్కుల్లో ఆక్రమణలు ఉన్నట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అందులో 11చోట్ల దేవుడి గుళ్ల ఉండటంతో మిగిలిన 23 పార్కుల్లో ఆక్రమణల తొలగింపునకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు.

ఆక్రమణల తొలగింపుపై అభ్యంతరం

మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెం.2పీ, 4పీలలో 1.83 ఎకరాల స్థలాన్ని పార్క్ స్థలంగా జీవీఎంసీ అధికారులు గుర్తించారు. అందులో ఉన్న ది టీచర్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్, నర్సరీ స్కూల్, వాచ్‌మన్ గది, రేకులు షెడ్‌లను ఇటీవల తొలగించారు. అయితే, దీనికి 20ఏళ్ల క్రితమే ప్రహరీలు నిర్మించి 10 ఏళ్లుగా ఏడాదికి రూ.4,23,404 చొప్పున వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ కడుతున్నామని టీచర్స్ సొసైటీ ప్రతినిధులు చెబుతున్నారు. ఇక్కడ నిర్మాణాల కోసం దరఖాస్తు చేయగా బీ.ఏ. నెంబరు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. పార్క్ స్థలం అయితే లక్షల్లో వీఎల్‌టీ ఎందుకు కట్టించుకున్నారో అధికారులే తెలపాలి.

ఆక్రమణలు తొలగించిన పార్కులు

మధురవాడ రెవెన్యూ గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న షెడ్‌లు, అక్రమ నిర్మాణాలు తొలగించిన పార్కులివీ..

1. కొమ్మాది టీచర్స్ లే అవుట్ సర్వే నం. 2పీ, 4పీలో పార్క్
2. కొమ్మాది టీచర్స్ లేఅవుట్‌లో సర్వే నం.2పీ పార్క్
3. మధురవాడ సర్వే నం.101లో కొత్తపాలెంలో పార్క్
4. అయోధ్యనగర్‌లో సర్వే నం.114పీలో పార్క్
5. కొమ్మాది డీఆర్‌కే రాజు టౌన్‌షిప్‌లో సర్వే నం. 2పీలో పార్క్
6. స్వతంత్రనగర్ ఈడబ్ల్యూఎస్ లే అవుట్ సర్వే నం.37పీలో పార్క్
7. ఎశాంతినగర్ సర్వే నం.10/11 లో పార్క్



ప్రశాంతి నగర్‌లో ఏళ్ల క్రితం నిర్మించిన షెడ్ తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది (ఫైల్)

జోన్	:	జీవీఎంసీ
జోన్-2		
మొత్తం పార్కులు	:	304
ఆక్రమణలు గుర్తించినవి	:	34
గుడులు ఉన్న పార్కులు	:	11
ఆక్రమణలు తొలగింపునకు గుర్తించినవి	:	23
తొలగించినవి	:	7

పార్కుల రక్షణలో రాజీ పడం



పార్కుల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదు. జోన్ పరిధిలో 23 చోట్ల ఆక్రమణలు గుర్తించాం. ఒకే రోజు 7 పార్కుల్లో ఆక్రమణలు తొలగించాం. కొన్నిచోట్ల కోర్టు కేసులు ఉన్నాయి. న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకు వెళ్తాం. అలాగే టీచర్స్ లే అవుట్‌లో పార్క్ స్థలం తమది అని సొసైటీ వారు అంటున్నారు. పైగా దీనికి వీఎల్‌టీ కూడా కట్టామని చెబుతున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం.

–కొట్యాడ కనకమహాలక్ష్మి, జోన్-2, కమిషనర్

మురుగు సమస్యతో మా పిల్లలకు వ్యాధులు

జోన్-2 పీజీఆర్ఎస్‌లో ఓ తల్లి ఫిర్యాదు



మురుగు ఇళ్లల్లోకి వచ్చేస్తుందంటూ జెడ్సీకి సెల్‌లో పరిస్థితి చూపిస్తున్న మహిళ సంధ్యారాణి

మధురవాడ: మురుగునీరు ఇళ్లల్లోకి వచ్చేయడంతో తన ఇద్దరు పిల్లల్లో ఒకరు తీవ్ర జ్వరం, మరొకరు డయేరియాతో ఇబ్బంది పడుతున్నారని జమంచిలి సంధ్యారాణి అనే మహిళ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమె తమ కాలనీ పరిస్థితిని ఫోన్‌లో చూపెడుతూ జెడ్సీకి వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పాడైపోవడంతో పీఎం పాలెం రామాలయం వద్ద గల ఎల్ఐజీ నివాసాల్లోకి మురుగునీరు వచ్చేస్తోందని, నెల రోజులుగా ఫిర్యాదు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇళ్లల్లోంచి బయటికి వెళ్లలేక ఉంటున్నామని, తక్షణ చర్యలు చేపట్టాలని ఆమెతో పాటు కాలనీ వాసులు కోరారు. అలాగే, ద్రోణంరాజు కల్యాణ మండపం మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పిళ్లా సూరిబాబు, పీఎం పాలెం అవంతి ఫంక్షన్ హాల్ నిర్వహణ అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని పోతిన సోంపాత్రుడు తదితరులు జెడ్సీ దృష్టికి సూచించారు.

24 అర్జీలు

జోన్-2లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు వచ్చాయి. వీటిలో ఈఈ వర్క్స్ విభాగానికే 13 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జోన్–1కు ఏడు వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఏడు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రెండు, ప్రజా ఆరోగ్య విభాగానికి రెండు, ఇంజనీరింగ్ విభాగానికి రెండు, యూసీడీకి ఒక వినతి వచ్చింది. ఇందులో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద డ్రైనేజీ సమస్యపై ఆలయ అర్చకులు వంశీమోహన కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్థానికులు జెడ్సీకి వినతి పత్రం అందించారు. కాలువ పూడుకుపోవడంతో మురుగు నిలిచి, రోడ్డుపైకి వచ్చేయడంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన జెడ్సీ ఇక్కడ కాలువ బాగా లోతుగా ఉన్నందున ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది ద్వారా పనులను నిర్వహించవలసి ఉందని తెలిపారు. త్వరలోనే దీన్ని సరిచేస్తామన్నారు.

డ్రైనేజీ పనులు వేగవంతం

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి చంద్రంపాలెం వెళ్లే సర్వీసు రోడ్డు వెంబడి ఉన్న డ్రైనేజీ పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇక్కడి డ్రైనేజీల్లో పూడిక తీత పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో స్థానికులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం' శీర్షికతో సాక్షి పత్రిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. కార్మికుల సంఖ్య పెంచి పూడికతీత పనుల్లో వేగం పెంచారు. అయితే, ఆరుదలకు వచ్చిన పూడిక పోగులను సర్వీసు రోడ్డులో రాకపోకలకు ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో మాత్రమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పూడిక అనంతరం డ్రైనేజీలపై కాంక్రీట్ పలకల పనులను పూర్తిస్థాయిలో చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికులు

అక్షయపాత్ర కిచెన్ వద్ద సోలార్ పవర్‌సిస్టమ్ ప్రారంభం

మూడు మిలియన్ల మంది పిల్లలకు ఆహార సరఫరా లక్ష్యంగా ఏర్పాటు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం వద్ద అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థ సోమవారం ప్రారంభమైంది. రూ 52.82లక్షలతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ పవర్ సిస్టమ్‌ను మానవీయ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ శంకర్, అక్షయ పాత్ర ఫౌండేషన్ జనరల్ మేనేజర్ అంబరీష్‌దాస ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఈ సోలార్ పవర్‌సిస్టమ్ ద్వారా మరింత ఎక్కువ ఆహారాన్ని తయారు చేసే వీలుంటుందని తెలిపారు. ప్రతిరోజు మూడు మిలియన్ల మంది పిల్లలకు ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అక్షయపాత్ర రీజనల్ మేనేజర్ అవినాష్, గంభీరం కిచెన్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



సోలార్ ప్యానెల్స్ పరిశీలిస్తున్న గౌరీశంకర్

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా నాయుడు

తగరపువలస: లయన్స్ క్లబ్ భీమిలి సెంటినియల్ నూతన అధ్యక్షునిగా టీవీఎస్ నాయుడు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జి. శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.ఎస్.ఆర్. చంద్రమూర్తి ఎంపికయ్యారు. చిట్టివలస కల్యాణమండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారి చేత డి.రాఘవేంద్రరావు ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ తమ క్లబ్ తరపున భవిష్యత్తులో మధుమేహ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధిని అదుపు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు కోట మల్లికార్జునరావు, అక్కరమాని రామునాయుడు, బొండా కిరణ్‌కుమార్, పడాల త్రినాథ్‌కుమార్, కలిగొట్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భీమిలిలోని నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్, పొట్టి శ్రీరాములు హైస్కూల్ గ్రంథాలయాలకు పుస్తకాలు అందించారు.



నాయుడిని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కాగితాలపేట రహదారి ఛిద్రం



మజ్జివలస లే అవుట్ నుంచి కాగితాల పేట రోడ్డు




పూర్తిగా శిథిలమైన కాగితాలపేట సీసీ రోడ్డు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలోని కాగితాలపేట గ్రామానికి సరైన రహదారి లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మజ్జివలస పంచాయతీలోని లే అవుట్ నుంచి ఈ గ్రామానికి చేరుకోవడానికి గతంలో పంచాయతీ అనుమతి ఇచ్చింది. అప్పట్లో ఈ లే అవుట్‌లో పాక్షికంగా వేసిన బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో వర్షం పడితే చాలా దూరం వరకు ఈ మార్గం చెరువును తలపిస్తుంది. అలాగే తాటితూరు పంచాయతీ నుంచి గతంలో కాగితాలపేటకు వేసిన సీసీ రోడ్డు నాణ్యత లేని కారణంగా ఎక్కడికక్కడ పగుళ్లు, కుంగిపోవడంతో రహదారి ఆకారం కోల్పోయింది. చుట్టూ వ్యవసాయ భూములు, పూలతోటల మధ్య ఉన్న ఈ కాగితాలపేటకు మజ్జివలస వైపు నుంచే కాకుండా తాటితూరు వైపు చెరువు గట్టును ఆనుకుని కూడా సరైన రహదారి లేదు. అధికారులు స్పందించి కాగితాలపేట ప్రజల రహదారి అవస్థలు తొలగించలని, పక్కా రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

దివీస్ రహదారిలో అలముకున్న చీకటి



మూలకుద్దు-చిప్పాడ పంచాయతీల వద్ద అలముకున్న చీకట్లు



మూలకుద్దు గ్రామం వద్ద చీకట్లు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ రహదారిలో చీకట్లు అలముకున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. అన్నవరం పంచాయతీ నుంచి బయల్దేరిన తరువాత కొత్తపేట, దివీస్ లేబొరేటరీ దాటిన తరువాత కంచేరుపాలెం, కొసనవానిపాలెం, ఆశిపాలెం , సిటీనగర్, చిప్పాడ కూడళ్లు అలాగే పాత మూలకుద్దు గ్రామం దాటిన తరువాత ఎరుసుపేట, మద్దిపేట, గుడివాడ, చెరకుపల్లి గ్రామాల వద్ద కన్ను పొడుచుకున్నా కానరాని అంధకారం అలముకుని ఉంది. ఈ మార్గంలో 24 గంటలు దివీస్ లేబొరేటరీకి భారీ వాహనాలతో పాటు ఉద్యోగులు వాహనాలపై నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. అదే సమయంలో రహదారికి ఇరువైపులా నివాసం ఉంటున్న వారు రోడ్లు దాటే సమయంలో ప్రమాదాలకు గురవుతుంటారు. వీధిదీపాలపై స్పందించవలసి ఉన్న పంచాయతీలు పట్టించుకోకపోవడంతో తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం దివీస్ లేబొరేటరీ అయినా విద్యుద్దీపాలు పునరుద్ధరించి వెలుగులు ప్రసరించేలా చూడాలని ఇటువైపు ఉన్న ఆరు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్

యువకుడి దుర్మరణం



ప్రదీప్‌కుమార్ (ఫైల్ ఫొటో)

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల, ముచ్చర్ల పంచాయతీల మధ్య నీళ్లకుండీలు – సింహాచలం రహదారిలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడి ప్రదీప్‌కుమార్(25) దుర్మరణం చెందాడు. వేపగుంట ముత్యమాంబ కాలనీకి చెందిన ప్రదీప్‌కుమార్ పద్మనాభం నుంచి నీళ్ల కుండీల వైపు పల్సర్ 220 ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఆ క్రమంలో రోడ్డుకు కుడివైపున ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె జీవనం ప్రతిబింబించేలా..

ఆకట్టుకుంటున్న పల్లె మ్యూజియం



శిల్పారామంలో మెరుగులు దిద్దుకున్న పల్లె మ్యూజియం

పీఎం పాలెం: పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన శిల్పకళారూపాలు శిల్పారామ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే కమ్మరి, బంగారు ఆభరణాలు తయారుచేసే స్వర్ణ కారుడు, తిరగలి విసురుతున్న మహిళ, కుండల తయారీకి కుమ్మరిచక్రం తిప్పుతున్న కుమ్మరి.. మట్టితో తయారు చేసిన కొన్ని ఆకృతులు, మంచంపై కూర్చుని గుడిగుడి గుంచం ఆడుతున్న పల్లె బాలికల శిల్పకళారూపాలను ఒకే చోట చేర్చి పల్లె మ్యూజియంగా ఏర్పాటు చేశారు. పట్నవాసులకు పరిచయం లేని పలు వృత్తులకు సంబంధించి, జీవకళ ఉట్టి పడేలా కళారూపాలతో రూపొందించిన ఈ పల్లె మ్యూజియంను ఇటీవల మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాటికి పెయింటింగ్, దుస్తులు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో కొత్త అందాలతో సందర్శకులను ఆకర్షిస్తోంది.

డ్రైనేజీల్లో నుంచే తాగునీటి పైపులు



డ్రైనేజీలో ఉన్న పైపు లైన్ లీక్ అవుతున్న దృశ్యం

మధురవాడ: మధురవాడ హైవేను అనుకుని ఉన్న డ్రైనేజీల్లో జీవీఎంసీ తాగునీటి పైపులైన్లు దర్శనం ఇస్తున్నాయి. మురుగునీరు, వాటర్ పైపులైన్ కాల్వలు అనేక చోట్ల కలసిపోయాయి. కొన్ని చొట్ల పైపు లైన్ లీకవుతుండటంతో నీరు కలుషిత మయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే పీఎం పాలెం గాయత్రీనగర్ జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో తాగునీరు కలుషితమై 23మందికి డయేరియా సోకి, ఆస్పత్రిపాలైన సంగతి తెలిసిందే. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలను కలవరపెడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటి సరఫరా విషయంలో శ్రద్ధ వహించాలని, పైప్ లైన్ లీకులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్చి విస్తరణ పనులు ఆపాలని వినతి



తహసీల్దారు రామారావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి ఎగువపేట వద్దనున్న మత్స్యకారుల గ్రామదేవత పోలమాంబ అమ్మవారి ఆలయ సమీపంలో చర్చి విస్తరణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మత్స్యకారులకు చెందిన ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు తహసీల్దారు రామారావుకు వినతి పత్రాన్ని అందించారు. గతంలో చర్చి నిర్మాణం జరగగా , ఇప్పుడు దాని విస్తరణ పనులు చేపట్టారని, వెంటనే వాటిని నిలుపుదల చేయించాలని కోరారు. సేవా సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ గతంలో ఇక్కడ టి.సంతోష్‌పాల్ అనే వ్యక్తి చర్చిని నిర్మించారని, ఇప్పుడు విస్తరణ పనులు చేపట్టారని చెప్పారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. అది ప్రభుత్వ స్థలమని తెలిసిందని, అధికారులు పరిశీలించి, చర్యలు చేపట్టాలని కోరారు. జెడ్సీని కలిసిన వారిలో సేవా సంఘ కోశాధికారి బర్రి కొండబాబు, సభ్యులు వాసుపల్లి జానకిరాం, వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి అనిల్, వాసుపల్లి శరత్, కారి చిన్నారావు ఉన్నారు.

ఎండుతున్న వరి నారు

అల్లాడుతున్న రైతు



టబ్‌లలో నీరు తెచ్చి నారుమడిని తడుపుతున్న మహిళారైతు



గొట్టిపల్లి కళ్లాలలో ఎండుతున్న వరి నారును చూసి రైతు ఆవేదన

తగరపువలస: గోస్తని నదికి దూరంగా ఉన్న రైతులు వర్షాన్నే నమ్ముకుని ఖరీఫ్ సాగు చేస్తుంటారు. జూలై ముగుస్తున్నా ఆనందపురం మండలంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడతో ఎండుతున్న నారుమడిని బతికించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో వందలాది ఎకరాలలో వరి సాగు కోసం రైతులు ప్రతిరోజూ ఆకాశం వైపు చూస్తున్నారు. బోని పంచాయతీలోని గోస్తని నది నుంచి కాలువ ద్వారా గొట్టిపల్లి పంచాయతీలోని దండుచెరువుకు నీరు రావలసి ఉన్నా, రాకపోవడంతో ఆకుమడులు ఎండిపోతున్నాయి. చూస్తూ ఊరుకోలేని రైతులు బిందెలతో నీరు తెచ్చి నారుమడిని బతికించుకుంటున్నారు. ఒకవైపు వర్షాలు రాక.. మరొక వైపు కూటమి ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాయమందక అప్పులు చేసి సాగులోకి దిగిన రైతులు తిప్పలు పడుతున్నారు.

ఇనుపరాడ్లు వేసి రోడ్డు ఆక్రమణ



రోడ్డును ఆనుకుని వేసిన ఐరన్ రాడ్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఓ వ్యక్తి రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని ఐరన్ రాడ్లు వేసి మరీ ఆక్రమించేశాడు. తమ ఇంటి ముందు ఉన్న రోడ్డుపై వాహనాలేవీ పార్క్ చేయకుండా ఇలా పర్మినెంట్‌గా రాడ్లతో మూసివేయడంపై స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. దీని వలన రాత్రి వేళల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

కమిషనర్ ఆదేశించినా..

గత శుక్రవారం వార్డులో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఎండాడ-రుషికొండ రోడ్డు వెంబడి ఇరువైపులా ఉన్న దుకాణాలను, ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయన ఆదేశాలను కూడా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోలేదు. నాలుగు రోజులు గడుస్తున్నా కొన్ని ఆక్రమణలు తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.